


# తోబాతేక్ సింగ్

ఉర్దూ మూలం : సాదత్ హసన్ మంటో
అనువాదం : పుల్లూరి సంపత్‌రావు

**దేశ విభజన తర్వాత రెండు మూడు సంవత్సరాలకు ఇండియా పాకిస్థాన్ ప్రభుత్వాలు ఖైదీలను మార్పిడి చేసుకున్నట్లుగానే పిచ్చివాళ్లను మార్పిడి చేసుకోవడానికి నిర్ణయించుకొన్నాయి. అంటే ఇండియా పిచ్చాసుపత్రుల్లోని పిచ్చివాళ్లను పాకిస్థాన్‌కు అలాగే పాకిస్థాన్ పిచ్చాసుపత్రుల్లోని హిందూ, సిక్కు పిచ్చివాళ్లను ఇండియాకు అందజేస్తారన్నమాట.**

ఈ నిర్ణయం విజ్ఞతతో కూడుకున్నదా లేదా అని చెప్పలేం. ఏమైనప్పటికీ సరిహద్దు రెండు వైపులనుంచి ఉన్నత స్థాయి సమావేశాల అనంతరం పిచ్చివాళ్ల మార్పిడికి ఓ తేదీని ఖరారు చేశారు. ఇందుకు సంబంధించిన అన్ని అంశాలను జాగ్రత్తగా పరిశీలించారు. ఇండియా వైపున ముస్లిం పిచ్చివాళ్లకు ఇండియాలో బంధువులున్నట్లయితే వాళ్లను ఇండియాలో వుండడానికి అనుమతించారు. మిగతా వాళ్లను సరిహద్దుకు పంపిస్తారు. ఇక్కడ పాకిస్థాన్‌లో ఇంచుమించు హిందు, సిక్కు ప్రజానీకం ఇండియాకు వెళ్లిపోయారు. గనుక ముస్లిమేతర పిచ్చివాళ్లను వుండనిచ్చే ప్రశ్న తలెత్తదు. హిందూ, సిక్కు పిచ్చివాళ్లందరూ పోలీస్ సంరక్షణలో సరిహద్దుకు తరలిస్తారు.

అక్కడ ఇండియాలో ఏం జరిగిందో తెలియదు. అయితే ఇక్కడ లాహోరు

లోని పిచ్చాసుపత్రికి పిచ్చివాళ్ల మార్పిడి వార్త చేరగానే అది అందరి చర్చలలో అదో తమాషా అంశంగా మారింది. గత పన్నెండేళ్లుగా ప్రతి నిత్యం జమీందార్ అనే దినపత్రిక చదివే ఓ ముస్లిం పిచ్చివాడు వున్నాడు. ఓ రోజు అతని స్నేహితుడొకరు అతన్ని ''మౌల్వీ సాబ్! పాకిస్థాన్ అంటే ఏమిటి?'' అని అడిగాడు. చాలా జాగ్రత్తగా ఆలోచించిన తరువాత అతను ''అది ఇండియాలో కత్తులు తయారు చేసే ప్రాంతం'' అని బదులిచ్చాడు. ఇది విన్నాక అతని మిత్రుడు ఏమీ మాట్లాడలేకపోయాడు.

అలాగే ఓ సిక్కు పిచ్చివాడు మరో సిక్కు అతన్ని ''సర్దార్ జీ, మనల్ని ఇండియాకు ఎందుకు పంపిస్తున్నారు? మనకు ఆ భాష కూడా రాదు కదా?'' అని అడిగాడు. ఆ సిక్కు అతను ఓ నవ్వు నవ్వి ''ఆ భాష నాకు అర్థమవుతుంది. భారతీయులు క్రూరులు. వాళ్లకు తాము అధికులమనే తల బిరుసు ఎక్కువ'' అని బదులిచ్చాడు.

ఒక రోజు ఓ ముస్లిం పిచ్చివాడు స్నానం చేస్తూ ''పాకిస్థాన్ జిందాబాద్'' అని గట్టిగా అరిచాడు. అతను ఎంత గట్టిగా అరిచాడంటే ఆ అరుపుకు అతను అదుపు తప్పి నేల మీద పడి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు.

పిచ్చాసుపత్రిలోని వాళ్లలో కొంత మంది నిజంగా పిచ్చివాళ్లు కాదు. వాళ్లలో హంతకులు కూడా వున్నారు. వాళ్ల కుటుంబ సభ్యులు అధికారులకు లంచాలు ఇచ్చి ఉరిశిక్ష నుంచి తప్పించడానికి పిచ్చాసుపత్రిలో చేర్పించారు. పిచ్చాసుపత్రిలోని వారికి దేశం ఎందుకు విడిపోయిందో కొంత తెలుసు. వాళ్లు పాకిస్థాన్ గురించి కూడా విన్నారు. కాని వాళ్లకు ఈ విషయాల పట్ల సంపూర్ణమైన అవగాహన లేదు. దిన పత్రికలు వాళ్లకు పెద్దగా ఏమీ తెలియజేయలేకపోయాయి. వాళ్లను చూసుకునే కాపలావాళ్లు నిరక్షరాస్యులైనందున వారు కూడా ఉపయోగపడలేకపోయారు. వాళ్లకు తెలిసిందల్లా-మహ్మద్ అలీ జిన్నా అనే పేరు గల వ్యక్తి ఉన్నాడని, అతన్ని ప్రజలు కయిద్- ఎ ఆజం అని పిలుస్తారని, అతను ముస్లింల కోసం పాకిస్థాన్ అనే ప్రత్యేక దేశాన్ని ఏర్పాటు చేశాడని. కాని అది ఎక్కడ వుందో, దాని సరిహద్దులేమిటో వాళ్లకు స్పష్టంగా తెలియదు. అందువల్లనే మతిస్థిమితం కోల్పోయిన పిచ్చివాళ్లు తాము ఇండియాలో ఉన్నామో లేక పాకిస్థాన్‌లో వున్నామో అని తికమకపడేవాళ్లు. ఒక వేళ ఇండియాలో ఉంటే మరి పాకిస్థాన్ ఎక్కడ వుంది? ఒక వేళ పాకిస్థాన్‌లో వుంటే ఈ మధ్య కాలందాక మేం నివసించిన ప్రాంతం ఇండియాగా ఎలా పిలువబడింది.

ఓ పిచ్చివాడు ఈ ఇండియా, పాకిస్థాన్ సమస్యలో ఎంతగా కూరుకుపోయాడంటే దీంతో అతను మరింత పిచ్చివానిగా తయారయ్యాడు. ఒక రోజు అతను ఓ చెట్టెక్కి కొమ్మ మీద కూర్చుని ఆపకుండా రెండు గంటల పాటు క్లిష్టమైన దేశ విభజనపై ఉపన్యాసం ఇచ్చాడు. కాపలావాళ్లు అతన్ని దిగమని అడిగినప్పుడు అతను మరింత పైకి ఎక్కాడు. వాళ్లు అతన్ని బెదిరించి భయపెట్టే ప్రయత్నం చేసినప్పుడు అతను ''నేను ఇండియాలో గాని పాకిస్థాన్‌లో గాని నివసించను. ఈ చెట్టు మీద ఇక్కడే నివసిస్తాను'' అని బదులిచ్చాడు. కాపలావాళ్లు ఎంతో కష్టంతో చాలా సేపు బతిమలాడి చాకచక్యంగా అతన్ని కిందకి దింపారు. కిందకు దిగింతర్వాత అతను ఏడ్చాడు. తన హిందు, సిక్కు స్నేహితులు తనను విడిచి ఇండియా వెళ్తారనే ఆందోళనతో వాళ్లను కౌగిలించుకున్నాడు.

ఎమ్మెస్సీ పట్టా పుచ్చుకొని రేడియో ఇంజనీర్‌గా పనిచేసిన ఓ పిచ్చివాడున్నాడు. అతన్ని ఇతరుల కంటే కొంచెం ఎడంగా ఉంచారు. అతను ఎప్పుడూ తోటలో ఓ దారి వెంబడి నిశ్శబ్దంగా అటూ ఇటూ నడుస్తుంటాడు. అయితే ఈ పిచ్చివాళ్ల మార్పిడి విషయం విన్న తర్వాత వొంటి మీద గుడ్డలిప్పేసి తోటంతా పరిగెత్తడం మొదలుపెట్టాడు.


చినోట్ నుంచి వచ్చిన ఒక లావుపాటి ముస్లిం పిచ్చివాడు వున్నాడు. అతను ముస్లీం లీగ్ పార్టీకి ఉత్సాహంగా పనిచేసిన కార్యకర్త కూడా. అతను ప్రతిరోజూ పదిహేను, పదహారుసార్లు స్నానం చేసేవాడు. అయితే అకస్మాత్తుగా ఓ రోజు ఈ అలవాటు మానుకున్నాడు. అతని పేరు మహ్మద్ అలి. ఒక రోజు తనను తాను కయిద్- ఎ ఆజం మహ్మద్ అలీ జిన్నా అని ప్రకటించుకున్నాడు. ఇది విన్న ఓ సిక్కు పిచ్చివాడు తాను మాస్టర్ తారాసింగ్ అని ప్రకటించుకున్నాడు. రక్తం ఏరులై పారేదే గాని వాళ్లిద్దరిని ప్రమాదకరమైన పిచ్చివాళ్లుగా పరిగణించి వేర్వేరు గదుల్లో పెట్టారు.

లాహోర్‌కు చెందిన ఓ హిందూ యువ లాయర్ కూడా ఉన్నాడు. అతని ప్రేమ వ్యవహారం విషాదంకావడంతో పిచ్చివాడయ్యాడు. అమృత్‌సర్ ఇప్పుడు ఇండియాలో వుందని విని అతను నిరాశకు లోనయ్యాడు. ఎందుకంటే అతని ప్రియురాలు ఆ నగరంలోనే వుంటుంది. ఆ అమ్మాయి అతన్ని తిరస్కరించినప్పటికి మతిస్థిమితం కోల్పోయాక ఆమెను మరిచిపోలేకపోతున్నాడు. ఈ కారణం చేతనే, దేశాన్ని రెండుగా చీల్చి తనను పాకిస్థానీగా తన ప్రియురాలిని భారతీయురాలిగా చేసిన ముస్లిం నాయకులందరిని తిట్టిపోస్తున్నాడు.

ఈ మార్పిడి వార్త పిచ్చాసుపత్రి చేరగానే చాలా మంది పిచ్చివాళ్లు లాయర్ దగ్గరికి వెళ్లి నీ ప్రియురాలు వుండే ఇండియాకు నిన్ను పంపిస్తారని అతని తృప్తి పరిచే ప్రయత్నం చేశారు. కానీ అతనికి లాహోరు విడిచి వెళ్లాలని లేదు. ఎందుకంటే అమృత్‌సర్‌లో ప్రాక్టీస్ సరిగా సాగుతుందో లేదో అని అతని భయం!

యూరోపియన్ వార్డులో ఇద్దరు ఆంగ్లో ఇండియన్ పిచ్చివాళ్లున్నారు. ఇంగ్లీష్ వాళ్లు ఇండియాకు స్వాతంత్ర్యం ఇచ్చి వెళ్లిపోయారని విని వాళ్లు ఎంతో ఆందోళన చెందారు. దీని ప్రభావం పిచ్చాసుపత్రిలో తమపై ఎలా వుంటుందోనని గంటల తరబడి చర్చిస్తూ గడిపారు. యూరోపియన్ వార్డు వుంటుందా? తీసేస్తారా? తమకు ఇంగ్లీష్ ఫలహారాలు వడ్డిస్తారా? బ్రెడ్‌కు బదులుగా ఆ దరిద్రపు గొట్టు చపాతీలు తినమని బలవంతం చేస్తారా?

ఒక సిక్కు పదిహేను సంవత్సరాలుగా ఆసుపత్రిలో వుంటున్నాడు. అతను తనదైన ఓ విచిత్రమైన భాష మాట్లాడతాడు. అర్థం పర్థం లేని ''ఊపర్ గుర్ గుర్ ది అన్నెగ్గి ది బే-దియాన్ ఓ మూంగ్ ది దాల్ ఆఫ్ ది లాల్టీన్'' అనే వాక్యాన్ని పదే పదే ఉచ్చరిస్తుంటాడు. అతనెప్పుడూ నిద్రపోడు. కాపలావాళ్లు చెప్పేదాని ప్రకారం పదిహేను సంవత్సరాలలో అతను ఒక్కసారి కూడా కనురెప్ప మూసి నిద్రపోలేదు. అయితే





# ఒంటిని కూడా పట్టించుకోవాలి

ఏ హోటల్‌లో తిన్నామా, ఏ రిసార్ట్‌లో రెస్ట్ తీసుకున్నామా అన్నది కాదు ముఖ్యం. అప్పుడప్పుడూ ఒంటి గురించి కూడా పట్టించుకోవాలి అంటోంది ప్రియాంకచోప్రా. ప్రతిరోజూ శరీరం మెరిసిపోవడానికి, చర్మసౌందర్యానికి ఏమేమి చేయాలో ఆలోచిస్తోందిట. ఇంతకీ ఏం చేస్తోందంటే మసాజ్ సెంటర్లకు వెళ్లడం, ఫిట్‌నెస్ ట్రైనర్లను ఇంటికే రప్పించుకుని శిక్షణ తీసుకోవడం చేస్తున్నానని చెబుతోంది. క్రిష్ సినిమాలో ఎవరో కాస్త లావయ్యావని చెప్పగానే సన్నబడాలని ఇదంతా చేస్తున్నట్టు అనుకుంటున్నారు ఆమె స్నేహితురాళ్లు. ఎవరు ఎన్ని చెప్పినా వినదు, అక్షయ్‌కుమార్ ఒక్క మాట చెప్పి వుంటాడు, కాస్త సన్నగా తయారవమని అనుకుంటున్నారు ఆమె అంటే పడని వాళ్లు. ఏదేమైతేనేం ప్రియాంక ఇప్పుడు ఒకింటిది కావడానికి కాదు, శరీరాన్ని కుదిమట్టంగా చేసుకోవాలని తాపత్రయపడుతోంది.

---

అప్పుడప్పుడు అతను గోడకు ఆనుకుని విశ్రాంతి తీసుకుంటాడు.

నిరంతరం నిలబడి వుండడం చేత అతని పాదాలు, మోకాళ్లు ఉబ్బిపోయి వున్నాయి. ఇలాంటి శారీరక సమస్యలున్నప్పటికీ అతను పడుకుని విశ్రాంతి తీసుకోవడానికి నిరాకరిస్తాడు. ఇండియా పాకిస్తాన్ మీదగాని, జరగబోయే పిచ్చివాళ్ల మార్పిడి మీదగాని చర్చ వినిపించిన సందర్భాలలో చాలా ఆసక్తిగా వింటాడు. తన అభిప్రాయం ఏంటని అడిగితే ''ఊపర్ గుర్ గుర్ ది అన్నెగ్జి ది బె-దియాన్ ది మూంగ్ ది దాల్ ఆఫ్ ది పాకిస్తాన్ గోర్నమెంట్'' అని ఎంతో సీరియస్‌గా చెప్తాడు.

ఆ తర్వాత అతను ''ఆఫ్ ది పాకిస్థాన్ గోర్నమెంట్'' స్థానంలో ''ఆఫ్ ది తోబాతేక్ సింగ్ గోర్నమెంట్'' అని మార్చాడు. అతను ఆసుపత్రిలోని ఇతర సహచరులను తోబాతేక్ సింగ్ ఎక్కడ వుందని, అది ఏ దేశానికి చెందినదని అడగడం ప్రారంభించాడు. కాని అది ఇండియాలో వుందా? లేక పాకిస్థాన్‌లో వుందా? అనేది ఎవరికి తెలియదు. ఈ విషయం మీద వాదన జరిగినప్పుడల్లా వాళ్లు మరింత తికమక పడుతున్నారు. ఎందుకంటే ఒకప్పుడు ఇండియాలో వున్న సియోల్ కోట్ ఇప్పుడు పాకిస్థాన్‌లో వుంది. ఎవరికి తెలుసు? ఇప్పుడు పాకిస్థాన్ వున్న లాహోర్ రేపు ఇండియాలో ఉంటుందేమో! లేక ఇండియా అంతా పాకిస్థాన్ అయిపోతుందేమో! ఇండియా, పాకిస్థాన్‌లు ఈ భూ ప్రపంచం నుంచి కట్టగట్టుకుని మాయం కావని ఏమైనా గ్యారంటీ వుందా?

ఈ సిక్కు పిచ్చివాని జుట్టు ఎప్పుడు దువ్వినట్టు లేదు. అతను అరుదుగా స్నానం చేయడం వలన అతని జుట్టు, గడ్డం జడలు గట్టుకుపోయి గగుర్పాటు కల్గించే రూపంతో వున్నాడు కాని అతను అపకారం చెయ్యని వ్యక్తి. ఈ పదిహేను సంవత్సరాలలో అతను ఒక్కరితో కూడా గొడవ పెట్టుకోలేదు.

అతనికి తోబాతేక్ సింగ్ జిల్లాలో భూమి వుందని మాత్రమే ఆసుపత్రిలోని వాళ్లకు తెలుసు. అతను సంపన్నుడైన భూస్వామి. అయితే ఆకస్మాత్తుగా అతనికి మతి పోయింది. అందువల్ల అతని బంధువులు గొలుసులతో కట్టి పిచ్చాసుపత్రికి తరలించారు.

అతని కుటుంబ సభ్యులు నెలకోసారి వచ్చి చూసి వెళ్లేవారు. అతని ఆరోగ్యం బాగానే వుందని నిర్ధారించుకున్న తర్వాత మళ్లీ వెళ్లిపోయేవారు. అతని కుటుంబ సభ్యుల సందర్శన చాలా సంవత్సరాలు కొనసాగింది. అయితే భారత్-పాకిస్థాన్ అల్లర్లు మొదలయ్యాక అవి ఆగిపోయాయి.

ఆ పిచ్చివాని పేరు బిషన్ సింగ్. కాని అందరూ తోబాతేక్ సింగ్ అని పిలిచేవారు. వారాలు, నెలలు సంవత్సరాలు గురించి అతనికి పెద్దగా అవగాహన లేకపోయినప్పటికీ తన బంధువులు తనను చూడడానికి ఎప్పుడు వస్తున్నారో మాత్రం అతనికి తెలిసేది. తనను చూడడానికి తన బంధువులు వస్తున్నారని ఆసుపత్రిలోని అధికారికి ముందుగానే చెప్పేవాడు. ఆరోజు మాత్రమే సంపూర్ణంగాస్నానం చేసి జుట్టుకు నూనె రాసి దువ్వుకునేవాడు. ఆ తర్వాత తన దగ్గరున్న వాటిలో మంచి డ్రెస్సు వేసుకుని తన బంధువులను కలవడానికి వెళ్లేవాడు.

ఒక వేళ అతను బంధువులు ఏమైనా ప్రశ్నిస్తే మాట్లాడకుండా నిశ్శబ్దంగా వుండడమో లేక ''ఊపర్ గుర్ గుర్ ది అన్నెగ్జి ది బె-దియాన్ ది ముంగ్ ది దాల్ ఆఫ్ ది లార్ తీన్'' అని గాని చెప్పేవాడు.

బిషన్ సింగ్‌ను పిచ్చాసుపత్రికి తీసుకొచ్చే సమయానికి ఓ కూతురు ఉంది. ఈ పదిహేను సంవత్సరాల కాలంలో ఆమె పొడవుగా పెరిగింది. అతన్ని చూడడానికి వచ్చినప్పుడు ఆ అమ్మాయిని గుర్తుపట్టలేకపోయేవాడు. చిన్నప్పుడు వాళ్ల నాన్నను చూసిన ప్రతిసారీ ఆ అమ్మాయి ఏడ్చేది. పెరిగి పెద్దయినప్పటికి ఇప్పటికీ ఆ అమ్మాయి అలాగే ఏడుస్తుంది.

విభజన సమస్యలు మొదలయ్యాక బిషన్ సింగ్ తోబాతేక్ సింగ్ గురించి ఇతర పిచ్చివాళ్లను అడగడం ప్రారంభించాడు. అతనికి తృప్తికరమైన సమాధానం లభించకపోవడంతో అతని ఆసక్తి రోజు రోజుకు బలపడసాగింది.

ఆ తర్వాత అతని బంధువులు రావడం మానేశారు. ఇంతకు ముందు వాళ్ల రాకను పసిగట్టేవాడు. కాని ఇప్పుడు అతని అంతరంగం మూగబోయింది.తన పట్ల జాలి చూపిస్తూ మాట్లాడుతూ తన కోసం పువ్వులు, స్వీట్లు, డ్రెస్సులు తీసుకొచ్చే ఆ బంధువులను చూడాలని ఎంతో కోరికతో వుండేవాడు. తోబాతేక్ సింగ్ ఇండియాలో వుందా పాకిస్థాన్‌లో వుందా అనే విషయాన్ని వాళ్లు తనకు తప్పకుండా చెప్పేవారు. అన్నింటికి మించి, వాళ్లు తన భూమి వుండే తోబాతేక్ సింగ్ నుంచే వచ్చేవాళ్లనే భావంలో వుండేవాడు.

పిచ్చాసుపత్రిలో తనే దేవుడు అనుకునే మరో పిచ్చివాడు వున్నాడు. ఓ రోజు బిషన్ సింగ్ అతన్ని తోబాతేక్ సింగ్ ఇండియాలో వుందా పాకిస్థాన్‌లో వుందా అని అడిగాడు. అతను పెద్దగా నవ్వి ''ఎందులోనూ లేదు. ఎందుకంటే దాన్ని ఎక్కడ పెట్టాలో ఇంకా నేను నిర్ణయించుకోలేదు'' అని బదులిచ్చాడు.

తోబాతేక్ సింగ్ సమస్యను పరిష్కరించి తన అయోమయ స్థితిని అంతం చేయమని ఈ ''దేవున్ని'' బిషన్ సింగ్ బతిమలాడాడు. కాని ''దేవుడు'' ఇతరత్రా ఆజ్ఞలు జారీ చేయడంలో తలమునకలైవుండడం చేత ఈ సమస్యను పట్టించుకోలేదు. ఓ రోజు బిషన్ సింగ్ ఓపిక నశించి ''ఊపర్ గుర్ గుర్ ది అన్నెగ్జి బె-దియాన్ ది ముంగ్ ది దాల్ ఆఫ్

వాహె గురూజీ వా ఖల్సా అండ్ వాహె గురూజీ కి ఫతా–జో బోలె సో నహల్ సత్ తకల్'' అని అరిచాడు. అలా చెప్పడంలో అతని ఉద్దేశం ఇది: ''నువ్వు ముస్లింల దేవునివి. ఒకవేళ నువ్వు సిక్కుల దేవునివి అయ్యుంటే నాకు తప్పకుండా సహాయం చేసేవాడివి''

పిచ్చివాళ్ల మార్పిడికి కొన్ని రోజుల ముందు బిషన్‌సింగ్‌ను కలవడానికి అతని ముస్లిం స్నేహితుడు తోబాతేపక్ సింగ్ నుంచి వచ్చాడు. అతను ఇంతకు ముందెప్పుడు ఆసుపత్రికి రాలేదు. అతన్ని చూడగానే బిషన్ సింగ్ అర్థాంతరంగా అటువైపు తిరిగి నడవడం ప్రారంభించాడు. అయితే కాపలా దారు అతన్ని ఆపాడు.

''ఇతను మిమ్మల్ని చూడడానికే వచ్చాడు. ఇతను మీ స్నేహితుడు ఫజులుద్దీన్'' అని కాపలా దారు చెప్పాడు.

బిషన్ సింగ్ ఫజులుద్దీన్ వైపు చూసి ఏదో గొణిగాడు. ఫజులుద్దీన్ అడుగు ముందుకేసి అతని మోచేయి పట్టుకుని ''నేనెంతో కాలంగా నిన్ను కలవాలని అనుకుంటున్నాను. ఇప్పటికిగాని టైం దొరకలేదు'' అన్నాడు. ''నీ కుటుంబ సభ్యులందరూ ఇండియాకు సురక్షితంగా వెళ్లారు. నాకు సాధ్యమైనంత వరకూ వాళ్లకు సహాయం చేశాను. నీ కూతురు రూప్ కౌర్....

బిషన్ సింగ్‌కు ఏదో గుర్తొచ్చినట్లయింది. ''కూతురు రూప్ కౌర్'' అని అన్నాడు.

ఫజులుద్దీన్ సంశయిస్తూ ''అవును, ఆమె.. ఆమె కూడా బాగానే వుంది. ఆమె వాళ్లతో వెళ్లిపోయింది'' అన్నాడు.

బిషన్ సింగ్ ఏమీ మాట్లాడలేదు. ఫజులుద్దీన్ చెబుతూనే వున్నాడు. ''నువ్వు బాగున్నావో లేదో చూడమని వాళ్లు నన్ను అడిగారు. నువ్వు ఇండియాకు వెళ్లబోతున్నట్లు నేనిప్పుడే విన్నాను. అన్నయ్యలు బలబీర్ సింగ్‌కు, రగ్‌బీర్ సింగ్‌కు నా సలాం చెప్పు. అలాగే చెల్లెలు అమృత్ కౌర్‌కు కూడా... నేను బాగానే వున్నానని బల్‌బీర్ భాయికి చెప్పు. అతను ఇక్కడ వదిలేసిన రెండు గేదెల్లో ఒకటి ఈనింది. మరొకటి కూడా ఈనింది కాని దాని దూడ ఆరురోజులకే చనిపోయింది. ఇంకా... ఇంకా నేనేదైనా చెయ్యాల్సిన పని వుంటే చెప్పమను. నేనెల్లప్పుడు చెయ్యడానికి సిద్ధమే. నేను నీకు కొన్ని స్వీట్లు తీసుకొచ్చాను'' బిషన్ సింగ్ ఆ ప్యాకెట్‌ను కాపలాదారుకు అప్పగించాడు.

''తోబాతేక్ సింగ్ ఎక్కడుంది?'' అని అడిగాడు.

ఫజులుద్దీన్ గతుక్కుమన్నాడు. ''తోబాతేక్ సింగా? ఎక్కడుంటుంది? ఎక్కడుందో అక్కడే వుంది'' అన్నాడు.

''పాకిస్థాన్‌లోనా, ఇండియాలోనా?'' బిషన్ సింగ్ పట్టుపట్టాడు.

ఫజులుద్దీన్ తికమకపడి ''ఇండియాలో... లేదు లేదు పాకిస్థాన్‌లో'' అన్నాడు.

బిషన్ సింగ్ వెళుతూ ''ఊపర్ ది గుర్ గుర్ ది అన్నెగ్జి ది బె–దియాన్ ది ముంగ్ ది దాల్ ఆఫ్ ది పాకిస్థాన్ అండ్ హిందుస్థాన్ ఆఫ్ ది దార్ ఫతే మన్'' అని గొణిగాడు.

చివరికి మార్పిడికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. బదిలీ చేయవలసిన పిచ్చివాళ్ల జాబితాతోపాటు మార్పిడి చేసే తేదీని కూడా ఖరారు చేశారు. వాతావరణం చాలా చల్లగా వుంది. లాహోర్ పిచ్చాసుపత్రి నుంచి హిందూ, సిక్కు పిచ్చివాళ్లను పోలీసుల పర్యవేక్షణలో ట్రక్కులో ఎక్కించారు. వాఘా సరిహద్దు దగ్గర భారత పాకిస్థాని అధికారులు కలుసుకొని మిగతా తతంగమంతా పూర్తి చేశారు. ఆ తర్వాత మార్పిడి మొదలయింది. అది ఆ రాత్రి వరకూ కొనసాగింది.

పిచ్చివాళ్లను వాహనం నుంచి కిందకు దింపి సరిహద్దు దాటించడం అంత సుళువు కాదు. కొంత మంది అయితే అసలు ట్రక్కును వదిలిపెట్టడం లేదు. దిగిన వాళ్లలో కొంత మందిని కంట్రోల్ చేయ్యడం కష్టమయింది. ఎందుకంటే వాళ్లు ఆ ప్రదేశమంతా ఎటు పడితే అటే తిరుగుతున్నారు. నగ్నంగా వున్న పిచ్చివాళ్లకు కాపలా వాళ్లు డ్రెస్సులు తొడగడానికి ప్రయత్నిస్తే, వాళ్లు మళ్లీ డ్రెస్సుల్ని వొంటిపైనుంచి తొలగిస్తున్నారు. కొంత మంది కోప్పడుతున్నారు. కొంత మంది పాడుతున్నారు. మరి కొంత మంది కొట్లాడుతున్నారు. వాళ్లు ఏడుస్తున్నారు. మాట్లాడుతున్నారు గాని ఏమీ అర్థం కావడం లేదు. ఇక మహిళా పిచ్చివాళ్ల గొడవ మరింత గందరగోళం. అంత చలిలో వాళ్ల నోళ్లు అనవసరమైన వాగుడుతో కదలాడుతూనే వున్నాయి.

చాలా మంది పిచ్చివాళ్లు ఈ మార్పిడికి వ్యతిరేకంగా ఉన్నారు. వాళ్లను అక్కడ నుంచి తొలగించి మరో తెలియని ప్రదేశానికి ఎందుకు పంపిస్తున్నారో వాళ్లకు అర్థం కావడం లేదు. సగం పిచ్చి వున్న కొంత మంది ''పాకిస్థాన్ జిందాబాద్, పాకిస్థాన్ ముర్దాబాద్'' అని అరవడం ప్రారంభించారు. ఈ నినాదాలు విని కోపోద్రిక్తులైన సిక్కు, ముస్లింల మధ్య కాపలావాళ్లు జోక్యం చేసుకొని ఘర్షణను నివారించారు. రిజిష్టర్‌లో పేరు నమోదు చేసుకోవడానికి బిషన్ సింగ్ వంతు రాగానే అక్కడ వున్న అధికారిని ''తోబాతేక్ సింగ్ ఎక్కడుంది? పాకిస్థాన్‌లో వుందా? లేక ఇండియాలోనా?'' అని అడిగాడు.

అధికారి నవ్వాడు. ''పాకిస్థాన్''లో అని బదులిచ్చాడు. ఇది వినడంతో బిషన్ సింగ్ వెనక్కి అడుగు వేసి తన మిగతా సహచరులు నిలబడి వేచి చూస్తున్న చోటుకి పరిగెత్తాడు. పాకిస్థానీ కాపలావాళ్లు అతన్ని పట్టుకొచ్చి సరిహద్దు దాటించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే అతను వెళ్లడానికి నిరాకరిస్తున్నాడు.

''తోబాతేక్ సింగ్ ఇక్కడే వుంది'' అని ఏడ్చాడు. ఆ తర్వాత అతను ''ఊపర్ ది గుర్ గుర్ ది అన్నెగ్జి ది బె–దియాన్ ముంగ్ ది దాల్ ఆఫ్ ది తోబాతేక్ సింగ్ అండ్ పాకిస్థాన్'' అని పెద్ద ఎత్తున గట్టిగా అరవడం ప్రారంభించాడు.

తోబాతేక్ సింగ్ ఇప్పుడు ఇండియాలో వుందని అధికారులు అతన్ని ఒప్పించడానికి ప్రయత్నించారు. ఒక వేళ పొరపాటున అక్కడ లేకపోతే దాన్ని త్వరలోనే అక్కడికి పంపిస్తామని చెప్పారు. కానీ అతను వినడం లేదు.

అతను అపకారం చెయ్యని వ్యక్తి కాబట్టి కాపలా వాళ్లు తమ పని తాము చేసుకుంటూనే అతన్ని నిలబడ్డ దగ్గరే వుండనిచ్చారు. రాత్రంతా నిశ్శబ్దంగా వున్నాడు గాని సూర్యోదయానికి కొంచెం ముందు బాధగా అరిచాడు. అన్ని వైపుల నుంచి అధికారులు పరుగెత్తుకొచ్చారు. పదిహేను సంవత్సరాలుగా పాదాల మీదే నిలబడ్డాడు. ఇప్పుడుతని ముఖం నేలవైపు పడిపోతున్నది. ముళ్ల కంచె వెనుక ఒక వైపు ఇండియా వుంది. మరో ముళ్ల కంచె వెనుక పాకిస్థాన్ వుంది. రెండింటికి మధ్య పేరులేని భూమి మీద తోబాతేక్ సింగ్ పడిపోయాడు.

★

